క్లుప్తంగా

పట్టణ ఆరోగ్య కేంద్రంలో తనిఖీ


పీహెచ్‌సీలో వైద్యసేవలపై ఆరా తీస్తున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య

నరసాపురం: స్థానిక మునసబుగారి వీధి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో మందులు సరిపడగా ఉన్నాయా? అనే అంశాన్ని పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ, పరసరాల్లో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట మున్సిపల్ శానిటరీ అధికారులు ఉన్నారు.

మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల


సెమిస్టర్ ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల చేశారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ డిసెంబర్ 3వ వారంలో ఈ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. మొదటి సెమిస్టర్‌లో 219 మంది విద్యార్థుల్లో 166 మంది 75.80 శాతంతో ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. వీరిని అభినందించారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

పెరుమాళ్ల సేవలు ప్రశంసనీయం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రాజు

నరసాపురం: రేషన్ డీలర్స్ అసోసియేషన్‌కు పెరుమాళ్ల సూర్యచంద్రరావు చేసిన సేవలు ప్రశంసనీయమని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. ఇటీవల మృతి చెందిన రేషన్ డీలర్ల అసోసియేషన్ ఉమ్మడి ఏపీ మాజీ కార్యదర్శి, నరసాపురం మండల కార్యదర్శి పెరుమాళ్ల సూర్యచంద్రరావు సంతాప సభ గురువారం పెరుమాళ్ల నివాసం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రాజు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావులు సూర్యచంద్రరావు సేవలను గుర్తుచేశారు. మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అధికారి ఏసు అధ్యతన జరిగిన ఈ కార్యక్రమంలో తమ సీల్దార్ టి.రాజరాజేశ్వరి, పలువురు రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న రేషన్ చౌక డిపోల్లో డీలర్ల భర్తీకి గురువారం ఆర్డీఓ దాశి రాజు తెలిపారు. ఈ నెల 2 నుంచి 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. తహసీల్దార్ లేదా ఆర్డీఓ నరసాపురం కార్యాలయాలకు చేరే విధంగా నేరుగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తులను అందజేయాలన్నారు. పాలకొల్లు పట్టణంలో 0543022 పూలపల్లి (ఓసీ మహిళ), 0585073 శంభుని పేట (ఓసీ), యలమంచిలి మండలంలో నెం 0544004 (ఓసీ), 0544009 (ఓసీ), 0544038 (ఓసీ), 0544039 (బీసీ–బీ మహిళ), 0544051 (బీసీ–డీ) చౌక డిపోలు ఖాళీగా ఉన్నట్టు చెప్పారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ.. కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం గత డిసెంబర్ 31న మండలంలోని ఎల్‌వీఎస్ పురం గ్రామానికి చెందిన ముచ్చెర్ల బాలకృష్ణ కూలి పనులు ముగించుకుని రాత్రి 9 గంటలకు తన ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా సెల్ ఫోన్ పడిపోయింది. వెనుక అదే గ్రామానికి చెందిన మల్లాడి మోహన్ కుమార్ తన ద్విచక్రవాహనాన్ని సెల్ ఫోన్‌పై ఎక్కించడంతో పగిలిపోయింది. దీంతో ముచ్చెర్ల బాలకృష్ణ తన సెల్‌ఫోన్‌పై బండి ఎందుకు ఎక్కించి పగలగొట్టావ్ అంటూ అడగగా మల్లాడి మోహన్ కుమార్ దుర్భాషలాడుతూ కర్రతో బాలకృష్ణను కాళ్లు, చేతులపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వరుసకు అన్నయ్య అయిన తోట సోమేశ్వరరావు భీమవరంలోని ప్రభుత్వాసుపత్రికి బాలకృష్ణను తీసుకువెళ్లి చికిత్స చేయిస్తున్నాడు. ముచ్చెర్ల బాలకృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్సై ఐ వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలకు 'అపూర్వ' కృషి

- అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం
- మొగల్తూరు పెన్మెత్స రంగరాజు హైస్కూల్‌కు మరో గేటు ఏర్పాటు
- వివిధ దశల్లో రహదారి మెరక పనులు


2005లో నిర్మించిన భవనం

మొగల్తూరు: స్థానిక పెన్మెత్స రంగరాజు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు (1977–78 బ్యాచ్) ముందుకొచ్చారు. కొద్దిపాటి వర్షానికే పాఠశాల ఆవరణలో నీరు నిలిచిపోయి మోకాలు లోతు నీటిలో రాకపోకలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందులపై పూర్వ విద్యార్థులు స్పందించారు. పాఠశాల అభివృద్ధిపై వారు దృష్టి పెట్టారు. పాఠశాల ఆవరణలోకి వర్షపు నీరు రాకుండా మెరక చేసేందుకు, ప్రహరీకి మరో గేటు ఏర్పాటుకు సహకారం అందించారు. పూర్వవిద్యార్థి, కెనడాలో ఉంటున్న కడలి సత్యసాగర్ సహకారంతో పాఠశాలకు ఉత్తరం వైపున మరో గేటు ఏర్పాటుచేశారు. ఈ గేటు నుంచి పాఠశాల భవనానికి చేరుకునేందుకు ఉన్న 150 మీటర్ల రహదారి ఉంది. ఇది వర్షం కురిసినా మునిగిపోకుండా కంకరతో మెరక చేస్తున్నారు. ఈ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. దీనికి పలువురు పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు.

ఎందరో ప్రముఖులు.. అభివృద్ధికి కలిసిరారు

దాత పెన్మెత్స రంగరాజు సుమారు 20 ఎకరాలు అందివ్వడంతో 1958లో పాఠశాల ఏర్పాటు చేశారు. దీనికి పెన్మెత్స రంగరాజు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలగా నామకరణం చేశారు. అప్పట్లో ముత్యాలపల్లి, రామన్నపాలెం, శేరేపాలెం గ్రామాల విద్యార్థులందరికీ ఇదే పాఠశాల. సుమారు 60 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ పాఠశాలలో ప్రస్తుతం 438 మంది విద్యనభ్యసిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి, రెబల్‌స్టార్ కృష్ణంరాజు, షార్ డైరెక్టర్, చంద్రయాన్ శాస్త్రవేత్త ఎంవైఎస్ ప్రసాద్, కల్నల్ వికే రావ్, కల్నల్ వీపీ విఠల్, వింగ్ కమాండర్ జయకర్ ఇలా ఎందరో ఈ పాఠశాలలో చదివిన వారే. వారంతా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపు తెచ్చుకోవడానికి ఈ పాఠశాలలోనే పునాది పడింది. ఐతే ఆ స్థాయిలో ఈ పాఠశాల అభివృద్ధి చెందలేదనే చెప్పాలి.

అమలుకాని హామీలు

సుమారు ఐదు దశాబ్దాల క్రితం తొమ్మిది గదులతో నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. వర్షం పడితే పాఠశాల ఆవరణంతా మునిగిపోతుంది. వర్షం వచ్చినప్పుడు తరగతి గదుల్లో శ్లాబుల నుంచి నీరు లీకవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. దీంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. శిథిలావస్థకు చేరిన ఈ పాఠశాలను సందర్శించిన మంత్రులు, జిల్లా పరిషత్ చైర్మన్లు నూతన భవనానికి నిధులు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. విద్యార్థులకు గదులు సరిపోకపోవడంతో 2005లో ఎస్ఎస్ఏ నిధులు రూ.25 లక్షలు వెచ్చించి మరో పది గదులు నిర్మించారు. పాత భవనం నుంచి కొత్త భవనంలోకి 2021లో మారారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయంలో నాడు నేడు పథకం నిధులు రూ.58 లక్షలు మంజూరు కావడంతో అదనపు గదులు నిర్మిస్తున్నారు.

అభివృద్ధికి కృషి చేస్తా


నేను విద్యనభ్యసించి ఈ స్థాయిలో ఉన్నందుకు కారణమైన పెన్మెత్స రంగరాజు ఉన్నత పాఠశాల అభివృద్ధికి నా వంతుగా కృషి చేస్తా. నా స్నేహితులతో మాట్లాడి పాఠశాల అభివృద్ధికి చేపట్టబోయే ప్రతి కార్యక్రమంలోనూ భాగస్వామినవుతాను. ఆర్థిక సాయం అందిస్తాను.

– కడలి సత్యసాగర్, పూర్వ విద్యార్థి, కెనడా

ఆనందంగా ఉంది


మా స్నేహితులంతా పాఠశాల అభివృద్ధికి ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఎవరైనా ముందుకొస్తే నా వంతు సహకారం అందిస్తా. చదుకున్న పాఠశాల అభివృద్ధికి స్నేహితులంతా ముందుకు రావడం చాలా సంతోషం.

– నాగళ్ల వెంకటేశ్వరరావు, పూర్వ విద్యార్థి, హైదరాబాద్


పూర్వ విద్యార్థి సాయంతో నిర్మించిన గేట్


మొగల్తూరు పెన్మెత్స రంగరాజు ఉన్నత పాఠశాల


పూర్వ విద్యార్థి సాయంతో రహదారి మెరక చేస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు

- జిల్లా స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు


పాలకొల్లు సెంట్రల్: : బహుమతులు అందిస్తున్న ఎంఈఓలు


పోడూరు : ప్రథమ స్థానంలో నిలిచిన మల్టీ పర్పస్ వీయింగ్ మిషన్ ప్రాజెక్టు

పాలకొల్లు సెంట్రల్: మండల స్థాయిలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గురువారం పలు హైస్కూళ్లలో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఇంజినీరింగ్, బయోకెమిస్ట్రీ, ఎన్విరాల్‌మెంట్ సైన్స్, ఎర్త్ స్పేస్ సైన్స్, టీచర్స్ ఎగ్జిబిషన్ ఇలా ఎనిమిది విభాగాల్లో తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిని ఎంఈఓలు సందర్శించి, విజేతలను ప్రకటించారు. వీరు ఈ నెల 4న వీరవాసరంలో జరిగే జిల్లా స్థాయిలో పోటీల్లో తమ ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. సైన్స్ ప్రదర్శనల ఏర్పాటుతో విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యత బయటకొస్తుందని ఎంఈఓ గుమ్మళ్ల వీరాస్వామి అన్నారు. గురువారం స్థానిక ఎంఎంకేఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటుచేశారు. టీఎస్ పవన్ (తిల్లపూడి), పీజీ ప్రదీప, కె ఫణి రామహర్ష, కె.సుభాష్, ఎం జస్వంత్ (బీవీఆర్ఎం), కె.యశ్వంత్ (ఎంజీబీ(ఆర్) బీసీ వెల్‌ఫేర్), వీవీఎ సాయి (పూలపల్లి), కె.పవన్ సాయి, ఎ.దీపక్ (చింతపర్రు), ఎస్ మోక్షిత, జె.హరిణి, పి.మోనిక (బీవీఆర్ఎ), టీచర్స్ ఎగ్జిబిట్ విభాగంలో జీఎస్ఎన్ మూర్తి (శివదేవుని చిక్కాల) విజేతలుగా నిలిచారు. విజేతలకు వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకర్ సౌజన్యంతో బహుమతులను ఎంఈఓలు వీరాస్వామి, శర్మ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ కన్వీనర్ వై ప్రభాకరశాస్త్రి, ఎంఎంకేఎస్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం పి.ధర్మారావు, పరిశీలకులుగా సీహెచ్ ప్రభావతి, కె.శ్రీనివాసరావు, ఎస్ శ్రీరామమూర్తి, ఎం సురేష్, వైఎస్ పద్మావతి, పీర్‌సాహెబ్, టీవీ సత్యవతి, జీఎల్‌వీవీ లక్ష్మిలు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

పోడూరు: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓలు జీవీఎస్ విజయకుమార్, జీవీ సూర్యనారాయణ అన్నారు. పోడూరు కల్నల్ డీఎస్‌రాజు జెడ్పీ హైస్కూలులో విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. మొత్తం 14 పరికరాలను విద్యార్థులు ప్రదర్శించారు. వై.పవన్‌సాయి వరుణ్ వర్మ (కొమ్ముచిక్కాల) తయారు చేసిన మల్టీపర్పస్ సీవింగ్ మిషన్‌కు ప్రథమ, ఎంబీఆర్ పవన్‌రిషిక్, వి.రుద్రవికాస్‌లు తయారు చేసిన (పెనుమదం) వేస్ట్ టు వాట్ పరికరానికి ద్వితీయ, ఇ.నవీన్, జి.గోకుల్ (జిన్నూరు)లు తయారు చేసిన ఫెర్టిలైజర్ స్ప్రేయర్ తృతీయ స్థానం లభించింది.

జిజ్ఞాసను పెంచే ప్రదర్శన


పెనుగొండ : హైడ్రో పవర్ ప్లాంట్ (ప్రథమ స్థానం)

పెనుగొండ: విద్యార్థి స్థాయి నుంచే పరిశోధనా రంగం వైపు మళ్లించి, వారిలో జిజ్ఞాసను పెంపొందించే విధంగా ఏర్పాటు చేస్తున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల్లో విద్యార్థులు తాము తయారుచేసిన ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు పోటీ పడ్డారు. వివిధ కేటగిరిల్లో పలు అంశాలపై ప్రదర్శనలిచ్చారు. ఆచంట నియోజకవర్గంలోని పెనుగొండ మండలంలో ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాలలో 19, పెనుమంట్ర మండలం మార్టేరు ఎస్వీజీ ఉన్నత పాఠశాలలో 18, ఆచంట మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 18, పోడూరు మండలంలో పోడూరు కల్నల్ డీఎస్‌రాజు పాఠశాలలో 14 ప్రదర్శనలు ఇచ్చి విద్యార్థులు ఆకట్టుకున్నారు. పెనుగొండ వ్యక్తిగత విభాగంలో పెనుగొండ ఎస్వీకేపీ అండ్ ఎస్కేవీఆర్ గరల్స్ పాఠశాల, టీచర్స్ విభాగంలో వడలి జిల్లా పరిషత్ పాఠశాల, గ్రూపు విభాగంలో ఇలపర్రు జెడ్పీ పాఠశాలలు విజేతలుగా నిలిచాయి. నేటి సమాజ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులను రూపొందించి విద్యార్థులు ఆకట్టుకున్నారని హెచ్ఎం పి.భరణీకుమార్ తెలిపారు. ఈ ప్రదర్శన వల్ల సొంత ఆలోచనలకు పదును పెట్టే అవకాశం ఏర్పడిందని పెనుగొండకు చెందిన విద్యార్థిని గంటా హారిక పేర్కొన్నారు.

వైఫై స్మార్ట్ బల్బ్‌కు ప్రథమం


యలమంచిలి : మేడపాడులో వైఫై స్మార్ట్ బల్బ్ పని తీరును వివరిస్తున్న కార్తీక్

యలమంచిలి: మేడపాడు హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. కొచ్చెర్లకోట కామేశ్వర వినీల్ కృష్ణ కార్తీక్ (కట్టుపాలెం) తయారుచేసిన వైఫై స్మార్ట్ బల్బ్‌కు మండల స్థాయిలో మొదటి బహుమతి లభించింది. కార్తీక్‌ను ఎంఈఓ కనుమూరు రామకృష్ణంరాజు అభినందించారు.

ఘనంగా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన


మొగల్తూరు : వైజ్ఞానిక ప్రదర్శన

మొగల్తూరు: స్థానిక హైస్కూల్లో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. వ్యక్తిగత విభాగంలో ఎస్‌వీవీ సాయికుమారి (మొగల్తూరు), సమూహ విభాగంలో వి.సరూన్య, దివ్య, ఉపాధ్యాయ విభాగంలో శ్రీలతదేవి (నీటితిప్ప) విద్యార్థులు జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యారు. ఎంఈఓ శామ్యూల్ జాన్, సర్పంచ్ పడవల సత్యనారాణ, ఉపసర్పంచ్ బోనం నర్సింహరావు పాల్గొన్నారు.

ముదునూరి పరామర్శలు

నరసాపురం రూరల్: కొప్పర్రు గ్రామానికి చెందిన న్యాయవాది, వైఎస్సార్ సీపీ నరసాపురం నియోజకవర్గ నాయకుడు ఇంజేటి జాన్ కెనడీ తల్లి రాజ్యలక్ష్మి (90) వృద్ధాప్యంతో ఇటీవల మృతి చెందారు. గురువారం రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులు జాన్ కెనడీ, రాబర్ట్ కెనడీలను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. రాజ్యలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సరిపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు తండ్రి ప్రతాప నాయుడి దశదిన కర్మ కార్యక్రమంలో ప్రసాదరాజు పాల్గొన్నారు. ప్రసాదరాజు వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

పెనుమంట్ర: మండలంలో వెలగలవారిపాలెం గ్రామంలో రూ.43.50 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెలగల సుగుణ అధ్యక్షతన నిర్వహించిన సభలో గ్రామంలో ప్రధాన సమస్యలను పెనుమంట్ర వాటర్ డీసీ చైర్మన్ వెలగల బులిరామిరెడ్డి వివరించగా, పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పితాని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మాండ్రు శాంతకుమారి, కర్రి బులిరామిరెడ్డి, మాజీ సర్పంచ్ జామి సత్యవతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

పోడూరు: భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని కవిటం గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సదస్సులో ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, సర్పంచ్ చుట్టుగుల్ల పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సభలపై ప్రచారం


వల్లూరులో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: భీమవరంలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించే సీపీఎం జిల్లా 26వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం ఆచంట మండల కార్యదర్శి పి.మోహన్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం వల్లూరులో కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వాలు ప్రజలుపై భారాలు వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, బొర్రా ధర్మారావు పాల్గొన్నారు.

బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడిగా ముక్కా


సత్యనారాయణకు నియామకపత్రం అందిస్తున్న నాయకులు

పాలకొల్లు సెంట్రల్: బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా ముక్కా సత్యనారాయణ నియమితులయ్యారు. ఆయనకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని గురువారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించాలంటే ఆర్ కృష్ణయ్యకు కేంద్ర మంత్రిగా అవకాశం కల్పించాలన్నారు. బీసీ రాజకీయ రిజర్వేషన్లు ఏబీసీడీలుగా విభజించి రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. అనంతరం సత్యనారాయణను సంఘం నాయకులు అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్, పొన్నమండ ముత్యాలరావు, వింజరపు శంకరం, కోరుకొండ సుబ్బారావు, తమ్మిరి వెంకటేశ్వరరావు, నీలంశెట్టి ప్రసాద్, మామిడిశెట్టి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కోళ్లపర్రులో కరెంట్ కట్

ఆకివీడు: కోళ్లపర్రు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం చెప్పారు. దీనివల్ల కోళ్లపర్రు, గుమ్ములూరు, అప్పారావుపేట, రాజులపేట, కొల్లేరు తీరంలోని చేపలు, రొయ్యల చెరువులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

వరినాట్లు పూర్తి చేయాలి

భీమవరం అర్బన్: దాళ్వా వరినాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఏఓ నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ ఏడాది దాళ్వా సాగుకు సుమారు 8 వేల ఎకరాలకు రైతులు శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటి వరకు 500 పైగా వరినాట్లు పూర్తయ్యాయన్నారు. వరినాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని లేకుంటే మార్చి, ఏప్రియల్ నెలల్లో పంట కోతకు వచ్చే దశలో కాలువలు కట్టేయడంతో నీటి ఎద్దడి వచ్చి పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. రైతులు త్వరితగతిన వరినాట్లు పూర్తి చేయాలని రైతులను కోరారు.

వెంకన్నకు తులసి పూజలు


పసలదీవిలో పాసురాన్ని చదువుతున్న భక్తులు


పెనుగొండ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద పూజలు

పెనుగొండ: స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా తులసీ పూజ, కల్యాణోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. గురువారం వెంకటేశ్వర స్వామి ఆలయ పెనుగొండ చెరుకువాడ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి పూజలు అభిషేకాలు చేశారు. మూల విరాట్‌కు లక్ష తులసీ పూజ, ఉత్సవ విగ్రహాలకు కల్యాణోత్సవం నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

పసలదీవిలో..

నరసాపురం రూరల్: నరసాపురం మండలం పసలదీవి రామాలయంలో ధనుర్మాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ వైష్ణవ సాంప్రదాయాన్ని ఆచరించే వారు ఎక్కువగా ఉండటంతో ప్రతి ఏటా ధనుర్మాసాన్ని పురస్కరించుకుని తిరుప్పావై వ్రతాన్ని నెల రోజులపాటు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా గురువారం శ్రీమాన్ ముడుంబై వెంకటాచార్యులు 18వ పాసురాన్ని వివరించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాశురాలను చదివి వినిపించి ప్రసాద వినియోగం చేశారు.